క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్‌లో కొనసాగించాలి



తాడేపల్లి రూరల్: పారిశుద్ధ్య కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించడం ఆపాలని సీఐటీయూ తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో పారిశుద్ధ్య కార్మికుల విస్తృత సమావేశాన్ని సంఘం అధ్యక్షురాలు ఝూన్సీరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చేసిన ఒప్పందం ప్రకారం ఆప్కాస్ నుంచి కార్మికులను తొలగించకుండా కొనసాగించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా వారిని గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలను కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

280వ రోజుకు చేరిన ఏసీసీ కార్మికుల దీక్షలు



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను నాయకులు వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కె.స్టీవెన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని, యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని అన్నారు. గత 280 రోజులుగా కార్మికులు దీక్షలు నిర్వహిస్తున్నారని, 300 రోజున పెద్ద బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు గురవయ్య, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, ఇమాంబి, సారమ్మ, శివ కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీవ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు



దుగ్గిరాల: జీవ ఎరువుల వాడకం వల్ల నేల ఆరోగ్యంగా ఉంటుందని.. రైతులు కూడా అధిక దిగుబడులు సాధించవచ్చునని గుంటూరు జిల్లా వనరుల కేంద్రం ఎ.డి.ఎ.ఐ.సునీత తెలిపారు. దుగ్గిరాల మండలంలోని పెదపాలెం, శృంగారపురం గ్రామాల్లో ఏవో ఆర్.విజయ బాబు ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సునీత మాట్లాడుతూ.. రైతులు పంటలకు అవసరమయ్యే పోషకాల యాజమాన్యంలో జీవ ఎరువులు, నానో ఎరువులు, పశువుల ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు అన్నీ ఉపయోగిస్తూ సమీకృత పోషకాల వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో ఎం.రాజవంశీ, వెటర్నరీ డాక్టరు సతీష్, ఏఈవోలు ఎం.ఆదిలక్ష్మి, వీపీఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే ఉపేక్షించం



మంగళగిరి టౌన్: విద్యుత్ వినియోగంలో అక్రమాలపై విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. వివిధ రకాలుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై రూ.4.37 లక్షల అపరాధ రుసుము విధించినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.పి.ఇ.(విజిలెన్స్) సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, సీఆర్‌డీఏ సర్కిల్ ఆపరేషన్ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళగిరి రూరల్ సెక్షన్ ఆత్మకూరు, చినకాకాని, కాజా, చిన వడ్లపూడి, కొత్తపాలెం, నూతక్కి, వడ్లపూడి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో 34 మంది అధికారులు, 102 మంది సిబ్బంది 34 బృందాలుగా ఏర్పడి 2,641 సర్వీసులను తనిఖీలు చేసినట్లు తెలియజేశారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే ఫిర్యాదులను పూర్తి వివరాలతో 94408 12263, 94408 12360 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో డి.ఇ.ఇ.లు కె.రవికుమార్, మల్లికార్జున ప్రసాద్, సురేష్‌బాబు, శ్రీనివాసరావు, ఎ.ఇ.లు కోటేశ్వరరావు, సతీష్‌కుమార్, శివశంకర్, ఆపరేషన్ ఎ.ఇ. మల్లికార్జున్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా వైఎస్సార్ సీపీ

- అన్ని గ్రామాల నుంచి తరలిన రైతులు
- ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిరసన గళం
- దుగ్గిరాల నుంచి తెనాలికి తరలిన అన్నదాతలు



కార్యక్రమానికి భారీగా హాజరైన రైతన్నలు

ఫిరంగిపురం: ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై నిరసన తెలిపేందుకు వైఎస్సార్ సీపీ తరుపున పలు గ్రామాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో గుంటూరు కలెక్టరేట్‌కు మంగళవారం తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ అధినేత ఆదేశాల మేరకు తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పిలుపు మేరకు నిరసన వ్యక్తం చేసేందుకు సుమారు 500 మంది రైతులు వివిధ వాహనాల్లో నినాదాలు చేసుకుంటూ వెళ్లారు. తరలివెళ్లిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివ రామిరెడ్డి, సయ్యద్ హబీబుల్లా, కె.చిన్నప్పరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కె.రామారావు, పెరికల చిన్నా, డి.సురేష్, డి.మెల్కియా, ఎస్.చిన్నప్ప, కె.ప్రవీణ్ రెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, బి.అంజిరెడ్డి, వై.హేమలతారెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, ఒ.పిచ్చిరెడ్డి, పి.శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సైదులు, షేక్.సుబాని, అమానుల్లా, షేక్.మస్తాన్‌వలి, బాలిరెడ్డి, టి.కృష్ణ, జె.రవి, ఎం.శ్రీనివాసరెడ్డి, జక్రయ్య, మోరం రెడ్డి, ఇస్మాయిల్, చిట్టా సీతారామిరెడ్డి, చిట్టా దినేష్‌రెడ్డి, ఎ.తిరుపతిరెడ్డి, సాల్మన్, మీరావలి, కె.వెంకట్రావు, ఆర్.బిక్షాలు, పి.బాల, జె.ఆనంద్, జయచంద్ర, పాములు, సాంబయ్య, రాయప్ప, వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరెడ్డి, శ్రీను, చిన్నసుబాని, జుబేర్, ఎస్.నాగరాజులు ఉన్నారు.

తెనాలికి బయలుదేరిన కర్షకులు..

దుగ్గిరాల: ఖరీఫ్ పంట వేసిన రైతుకు ఎరువులు దొరకక ఇబ్బందులు పడుతున్నారని.. అకాల వర్షాలకు పంట దెబ్బతిన్న రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల రైతులు దుగ్గిరాల నుంచి తెనాలి తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, సెల్ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తాడికొండ అడ్డరోడ్డు నుంచి తరలి వెళుతున్న పార్టీ శ్రేణులు

తాడికొండ నుంచి తరలిన పార్టీ శ్రేణులు

తాడికొండ: రాష్ట్రంలో యూరియా కొరతతో రైతన్నలు పడుతున్న ఇబ్బందులపై ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నినదించారు. అన్నదాతలతో కలిసి తాడికొండ, తుళ్లూరు మండలాల నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీని వైఎస్సార్ సీపీ తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి జెండా ఊపి ప్రారంభించగా పలువురు హోరెత్తించే నినాదాలతో గుంటూరుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెనాయుడు నేతృత్వంలో జరుగుతున్న ఈ దందాపై ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి రైతులను ఆదుకునేందుకు కనీస స్పందన లేకపోవడం దుర్మార్గం అన్నారు. అనంతరం పలువురు నినాదాలు చేస్తూ భారీగా గుంటూరు ఆర్డీవో కార్యాలయం ముట్టడికి తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, తుళ్లూరు మండల పార్టీ అధ్యక్షులు మైనేని నాగల మల్లేశ్వరరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, తాడికొండ మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ళ మనోహర్, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షులు దాసరి రాజు, ఎంపీటీసీలు వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, ఎస్సీ, బీసీ, యువజన విభాగం మండల అధ్యక్షులు గుంటి రఘువరన్, దమ్మాటి మోహనరావు, షేక్ అజీస్, గ్రామపార్టీ అధ్యక్షులు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, సాంబిరెడ్డి, బండెల సుమన్, షేక్ బాజీ, నిమ్మగడ్డ రాజేంద్ర, అచ్చయ్య, ఇసుకపల్లి రమేష్, కొప్పుల శేషగిరిరావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు మండలం నుంచి..

మేడికొండూరు: యూరియా బ్లాక్ మార్కెట్‌పై నిరసనగా గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చింది. దీంతో తాడికొండ నియోజకవర్గం సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో మేడికొండూరు మండలం నుంచి అన్ని గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం భారీగా తరలి వెళ్లారు. ర్యాలీలో మండల పార్టీ అధ్యక్షుడు తాళ్లూరు వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ రబ్బానీ, బొద్దు పెద్ద సాంబయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ సుభాని, గండికోట రసూలు, ముత్యాల బాలస్వామి, తమనంపల్లి శాంతయ్య, అల్లు శ్రీనివాస్‌రెడ్డి, కొరివి చెన్నయ్య, ఉడతా శ్రీనివాసరావు, బొద్దు నాగమల్లేశ్వరరావు, నాసరవల్లి అబ్బాస్, నరసింహారావు, దండ సూరి, నారాయణరెడ్డి, రాఘవరావు, గొంది రవి, ఎంపీటీసీ వల్లెపు శ్రీను, మిరియాల శివరామకృష్ణ, గోపి దేశి శ్రీను, లూర్దురాజు, ఖాశిం, లూర్దుబాబు, యోహాను, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గుంటూరు వెళ్లేందుకు సిద్ధమైన రైతులు



అన్నదాత పోరుకు తరలి వెళ్తున్న మండల నాయకులు, కార్యకర్తలు

ఉండవల్లిలో ముగిసిన గణపతి నిమజ్జనం



లడ్డూను వేలంలో దక్కించుకున్న దేవేందర్ రెడ్డి

- రూ.3.30 లక్షలకు చేరిన లడ్డూ వేలం
- రాజన్న విగ్రహానికి పుష్ప, క్షీరాభిషేకాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం నిర్వహించారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన గణపతి గ్రామోత్సవం సుమారు 15 గంటల పాటు సాగింది. గ్రామోత్సవానికి ముందు లడ్డూ వేలం పాట నిర్వహించగా ఉండవల్లి గ్రామానికి చెందిన కొల్లి వెంకట చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు దేవేందర్ రెడ్డి రూ.3,30,000లకు పాటలో దక్కించుకున్నారు. స్వామివారిని ఏర్పాటు చేసినప్పుడు భక్తులు ఇచ్చిన నగదు మణిహారాలను వేలం పాట నిర్వహించారు. దీని నిమిత్తం రూ.4,70,000లు ఆదాయం లభించింది. ఈ ఏడాది ఉండవల్లి రెడ్ల రామమందిరం ఆదాయం రూ.7 లక్షలు వచ్చిందని కమిటీ సభ్యులు ప్రకటించారు. వినాయక గ్రామోత్సవం ప్రారంభంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఊరేగింపు ముందు భాగాన నిలిపి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద ఏర్పాటుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు ఘన సన్మానం నిర్వహించారు.



రాజన్న విగ్రహానికి పుష్ప, క్షీరాభిషేకాలు



వైఎస్సార్ చిత్రపటంతో ఊరేగింపు..

ఎల్‌వోసీ చెక్కుల అందజేత

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంగళవారం తాడేపల్లి పట్టణ టీడీపీ అధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 4వ వార్డుకు చెందిన బొమ్మిరెడ్డి అప్పిరెడ్డికి రూ.72,480లు.. 16వ వార్డుకి చెందిన గుండు వెంకట రమాదేవికి రూ.80,132లు.. 20వ వార్డుకు చెందిన మానుపాటి వెంకటేశ్వర్లుకు రూ.40,350లు.. 22వ వార్డుకు చెందిన ఎం.సీతకు రూ.25,000 చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు, మేకా పుల్లారెడ్డి, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, ఇట్టా భాస్కర్, హనుమంతు, లావణ్య, తాడిబోయిన గోపి, షేక్ అక్బర్, షేక్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో..

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) చెక్కులు మంజూరు అయ్యాయి. వీటిని స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎల్‌వోసీ రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు ఆయా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..

యర్రబాలెం గ్రామానికి చెందిన చిమట వెంకటేష్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.3,56,300లు.. మక్కె లక్ష్మికి రూ.1,38,788లు విలువగల చెక్కులను స్థానిక నాయకులు మంగళవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పడవల మహేష్, షేక్ రియాజ్, అంకారావు, రుద్రు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నారై కళాశాల వద్ద రోడ్డు ప్రమాదం



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

మేడికొండూరు: మండల పరిధిలోని విశదల ఎన్నారై కళాశాల సమీపం వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్లకు చెందిన ఎర్రం శ్రీనివాసరావు కుమారుడు కృష్ణ(26) గుంటూరు నుంచి పిడుగురాళ్ల వైపు కారులో ప్రయాణిస్తున్నారు. మేడికొండూరు నుంచి గుంటూరు వస్తున్న మరో కారు వేగంగా యువకుడి కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో అక్కడే ద్విచక్ర వాహనంపై నిలబడి ఉన్న మరియదాసు, గాలయ్య, వెంకట్రావు, శీను అనే నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు గాయపడిన వారికి తక్షణ సహాయం చేశారు. సమాచారం అందుకున్న మేడికొండూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

జౌళి శాఖ నుంచి చేనేతను వేరు చేసి రక్షించాలి



సమావేశంలో పాల్గొన్న చేనేత సంఘం, సీపీఐ నాయకులు

మంగళగిరి టౌన్: జౌళి శాఖ నుంచి చేనేతను వేరు చేసి ప్రత్యేకంగా రక్షించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పరిశ్రమ రక్షణకు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 11వ తేదీన పెడనలో చేనేత అధ్యయన యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.127.87 కోట్లు బకాయిలుగా ఉన్నాయని.. వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు గిరి పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మంగళవారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో సామాజిక మాధ్యమాల ద్వారా సైబర్ నేరగాళ్లు ఎలాంటి నేరాలకు పాల్పడుతున్నారో వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసీఏ విభాగం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో యూజర్లు డీపీగా తమ ఫొటోలను పెట్టుకోవడం వల్ల సైబర్ నేరగాళ్లు వాటితో డబ్బుకోసం బెదిరింపులకు, లైంగిక వేధింపులకు పాల్పడవచ్చని వివరించారు. మహిళలకు అత్యవసర సహాయం కోసం 181కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రొఫెసర్ డాక్టర్ డి.సురేంద్ర వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

బీసీల ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి



మంగళగిరి టౌన్: 2024 ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని సంఘ రాష్ట్ర కార్యాలయంలో బీసీ నాయకులు, వివిధ కుల సంఘ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ.. ఈనెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లకు ర్యాలీగా వెళ్లి బీసీల 5 ప్రధాన డిమాండ్లపై మెమోరాండం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనాభా దామాషా మేరకు బీసీ సబ్‌ప్లాన్ రూపొందించి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ప్రత్యేక నోడల్ ఏజన్సీ ద్వారా సక్రమంగా నిధులు ఖర్చయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, కృష్ణ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరి బత్తుల అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత్ భారత్ అభియాన్‌పై విద్యార్థులకు అవగాహన



మంగళగిరి టౌన్: మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఉన్నత్ భారత్ అభియాన్‌పై తాడేపల్లి రూరల్ ఇప్పటం గ్రామంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నత్ భారత్ అభియాన్‌పై విద్యార్థులు సమగ్రంగా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమ లక్ష్యాలను వివరించారు. విద్యార్థులు నిర్వహించనున్న సర్వేను సమర్థంగా చేపట్టడానికి అవసరమైన సూచనలు అందించారు. విద్యార్థులు క్షేత్ర స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసి గ్రామ ప్రజలతో సంభాషించి వారి అవసరాలను అర్థం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూబీఏ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రేఖా నరేష్‌బాబు, ఫార్మసీ కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ పాముల రెడ్డి, హెచ్‌వోడీ పైజాన్ అలీ, స్టూడెంట్ కో–ఆర్డినేటర్ బిందు ప్రియాంక, జెర్సీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామ అధ్యక్షులు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ ద్వారా సురక్షితమైన తాగునీరు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: తాడికొండ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు సరఫరాకు జల్ జీవన్ మిషన్ ద్వారా మంజూరు చేసిన పనులను సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గ్రామీణ నీటి సరఫరా అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో తాడికొండ నియోజకవర్గ శాసన సభ్యులు తెనాలి శ్రావణకుమార్‌తో కలిసి తాడికొండ నియోజకవర్గ పరిధిలో జల జీవన్ మిషన్, ఇతర పథకాల ద్వారా మంజూరు చేసిన తాగునీటి సరఫరా పనులపై గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. తాడికొండ నియోజకవర్గ పరిధిలోని తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు తుళ్లూరు మండలాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న నీటి సరఫరా పంపిణీ పైపులైను, నీటి వనరుల పెంపుదల, ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు మరమ్మతు పనుల పురోగతిపై గ్రామాల వారీగా అధికారులతో సమీక్షించి, పనులు వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.

జిల్లా జూనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక



మేడికొండూరు: మండలంలోని కొర్రప్రాడు జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో మంగళవారం గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ జూనియర్ బాలబాలిక జట్ల ఎంపిక నిర్వహించారు. కార్యక్రమానికి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 50 మంది బాలురు, 30 మంది బాలికలు క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 12 మంది బాల, బాలికలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసినట్టు గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి బొంత అనిల్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కడియం జయరావు, జిల్లాలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు బాలకృష్ణ, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలి

మంగళగిరి టౌన్: డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరగనున్న సీఐటీయూ అఖిల భారత 18వ మహా సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.బాలాజీ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని పాత మంగళగిరిలో మంగళవారం మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ.. ఎంటీఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఆప్కాస్ కార్మికులను 60 ఏళ్లు నిండాయని తొలగించడం దారుణమన్నారు. వారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు చలపతి రావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షురాలు వెంకటేశ్వరమ్మ, నాయకులు కృష్ణ, వీరయ్య, మల్లేశ్వరి, హనుమంతరావు, దుర్గ, నాగయ్య పాల్గొన్నారు.

15న చలో విజయవాడ

తాడేపల్లి రూరల్: ఈనెల 15వ తేదీన నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్య నగర్‌లో ప్రాంత నిర్మాణ కార్మికుల విస్తృత సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు.